సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 1 । ఆగస్టు । 2023



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.150

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.150 పలికింది. కనిష్టం రూ.120, సరాసరి రూ.132 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
34.9°/21.5°

జిల్లాలో సోమవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

పౌరసరఫరాల శాఖ గోదాముల తనిఖీ



బుక్కపట్నం గోదాములో సరుకు పరిశీలిస్తున్న జేసీ చేతన్

పుట్టపర్తి: బుక్కపట్నంలోని పౌర సరఫరాల గోదాములను జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గోదాముల్లో స్టాక్ ఎంత ఉంది... ఇంకా ఎంతమేర నిల్వ చేయవచ్చు... అన్న వివరాలను స్టాకిస్టు రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సరుకులు అందజేయాలని, పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. జేసీ వెంట డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, తహసీల్దార్ కరుణాకర్, సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ



పుట్టపర్తి అర్బన్: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, నేతన్న, డప్పు కార్మికులు, చర్మకారులు తదితరులకు ఇచ్చే 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ మంగళవారం నుంచి ఐదురోజుల పాటు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. జిల్లాలో 2,61,333 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, ప్రభుత్వం రూ.72.55 కోట్లు మంజూరు చేసిందని ఆయన వెల్లడించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు పింఛన్ పంపిణీ చేసేందుకు వీలుగా సోమవారమే సచివాలయాల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఇప్పటికే వలంటీర్లు తమ పరిధిలోని లబ్ధిదారులకు అందజేయాల్సిన మొత్తాన్ని డ్రా చేసుకున్నారన్నారు. జిల్లాలో 100 శాతం పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

సత్యసాయికి నృత్యనివేదన



బాలవికాస్ చిన్నారుల నృత్యప్రదర్శన

ప్రశాంతి నిలయం: హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన పలువురు చిన్నారులు సత్యసాయికి నృత్యనివేదన అర్పించారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన హిమాచల్ ప్రదేశ్ సత్యసాయి భక్తులు సోమవారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తమ రాష్ట్ర సంప్రదాయాలను ప్రతిబింబించే రీతిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది. హిమాచల్ ప్రదేశ్ జ్వాలాముఖి ప్రాంతానికి చెందిన యూరో పబ్లిక్ స్కూల్‌కు చెందిన బాలవికాస్ విద్యార్థులు కథక్ నృత్యప్రదర్శనతో సత్యసాయి వైభవాన్ని వివరించారు. అనంతరం తమ సంప్రదాయ నృత్యమైన జమక్రా నృత్యంతో అందరినీ అలరించారు. సత్యసాయి సేవా సంస్థల నార్త్‌జోన్ అధ్యక్షుడు డాక్టర్ సంజయ్ వారి ప్రాంతంలో కొనసాగుతున్న సత్యసాయి సేవలను వివరించారు.


జూలై 11వ తేదీన పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువుకు చెందిన కృష్ణవేణి (26) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బీ ఫార్మసీ పూర్తి చేసిన ఆమె తమ బంధువుల అబ్బాయినే ప్రేమించి పెళ్లి చేసుకుంది. మూడు రోజులకే దంపతుల మధ్య గొడవ ప్రారంభమైంది. దీంతో నెలరోజుల్లోనే కృష్ణవేణి జీవితం చాలించింది. అదేవిధంగా జూలై 22న హిందూపురంలోని రహమత్‌పురానికి చెందిన తస్లీమా (20) పెళ్లయిన 20 రోజులకే ఆత్మహత్య చేసుకుంది.

లేపాక్షి మండలం కల్లూరుకు చెందిన మధు (26) జూలై 13న ఇంట్లో ఉరి వేసుకుని విగతజీవిగా మారాడు. టైల్స్ పని చేసే మధు.. కర్ణాటకకు చెందిన ఓ మహిళతో సహజీవనం సాగించేవాడు. ఇద్దరి మధ్య గొడవ ప్రారంభం కాగా.. ఆమెను వదిలి ఇంటికి చేరుకున్నాడు. జరిగిన విషయాన్ని తల్లి చెప్పుకుని బాధపడ్డాడు. ఆమె నచ్చజెప్పినా.. తెల్లవారేసరికి ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నాడు. అదేవిధంగా జూలై 17వ తేదీన సోమందేపల్లికి చెందిన రామాంజి (32) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడు.

రొద్దం మండలం బూచెర్ల గ్రామానికి చెందిన వితంతువు కాపు లక్ష్మీదేవమ్మ (47) జూలై 14వ తేదీన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుమార్తె రాజేశ్వరి భర్త కొన్ని రోజుల క్రితమే మరణించాడు. ఆర్థిక సమస్యల కారణంగా కుటుంబంలో ఒక్కొక్కరూ బలవన్మరణం చెందుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా జూలై 16న అమరాపురం మండలం తమ్మడేపల్లి గ్రామానికి చెందిన లత (36) అనారోగ్య సమస్యలతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది.

– జూలై 15న గోరంట్ల మండల కేంద్రంలో చిక్క మునిరాజ్ (22) అనే వ్యక్తి బేకరీపైన ఉన్న గోదాములో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకుముందు రెండు వారాల నుంచి అతడు కనిపించకుండా పోయినట్లు బేకరీ నిర్వాహకుడు విశ్వనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

..ఇలా రోజూ జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో ఆత్మహత్య కేసు వెలుగులోకి వస్తోంది. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, విఫల ప్రేమ కేసులే ఎక్కువగా ఉంటున్నాయి. బాధితులు వందేళ్ల జీవితాన్ని క్షణాల్లో ముగించేస్తున్నారు.



బతకలేక బలవన్మరణం

- కుటుంబ కలహాలతో కొందరు..
- ఆర్థిక భారంతో ఇంకొందరు..
- ప్రేమ విఫలమై మరికొందరు..
- సమస్యకు పరిష్కారంగా చావును ఎంచుకుంటున్న వైనం
- జిల్లాలో పెరిగిపోతున్న ఆత్మహత్యల సంఖ్య

సాక్షి, పుట్టపర్తి: అప్పటి వరకు కళ్ల ముందు కనిపించిన వారు ఆకస్మాత్తుగా విగతజీవులవుతున్నారు. చలాకీ మాటలతో కలివిడిగా ఉండేవారు క్షణాల్లో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోతున్నారు. వ్యాపారంలో ఇబ్బందులు, మానసిక ఒత్తిడి, కుటుంబ సమస్యలు, వైవాహిక జీవితం తడబాటు, ప్రేమ విఫలం ...ఇలా కారణం ఏదైనా పరిష్కారంగా చావునే వెతుక్కుంటున్నారు. ఉరికొయ్యలకు వేలాడుతూ తమను నమ్ముకున్న వారికి తీరని శోకాన్ని మిగులుస్తున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో పదేళ్లలోపు వారితో పాటు 60 ఏళ్ల వృద్ధులూ ఉంటున్నారు. ఇటీవల బలవన్మరణం పొందిన మధ్య వయస్కుల్లో దాదాపు అందరూ భూ సమస్యలతో ఇబ్బందులు పడినట్లు తెలుస్తోంది. క్రయవిక్రయాల దగ్గర విభేదాలు తలెత్తినప్పుడు ఆర్థికభారం మీద పడటంతో తీర్చలేని స్థితిలో బలిపీఠం ఎక్కుతున్నారు.

మహిళలే అధికంగా..

ఈ ఏడాది ఆరంభం నుంచి జూలై చివరి వరకు మొత్తం 378 మంది ఆత్మహత్యాయత్నం చేశారు. అందులో 206 మంది ప్రాణాలతో బయటపడ్డారు. మరో 172 మంది మృతి చెందారు. ఆత్మహత్య కేసుల్లో అన్ని వయసుల వారూ ఉన్నారు. అయితే పురుషుల కంటే మహిళలే అధికంగా ఉండటం గమనార్హం. ఆత్మహత్యయత్నం చేసిన వారిలో 63 శాతం మహిళలు, 37 శాతం పురుషులు ఉన్నారు. అందులో 40 ఏళ్ల లోపు వారు 69 శాతం ఉండగా, 30 ఏళ్ల లోపు వయసు మహిళలు 25 శాతం ఉన్నారు.

జీవితంపై విరక్తి చెంది..

ఆత్మహత్యలకు తెగించిన వారిలో చాలా మంది కుటుంబ కలహాలు, అనారోగ్య సమస్యలు కారణంగా ప్రాణాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక దాంపత్య బంధంలో ఇమడలేక కొందరు యువతులు పెళ్లయిన రోజుల వ్యవధిలోనే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. యువకుల్లో చాలా మంది వివాహ బంధంలో ఇబ్బందులు తలెత్తినా పునరుద్ధరించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తూ విఫలమవుతున్నారు. ఈ క్రమంలోనే కుటుంబ కలహాలతో వివాహమైన పదేళ్ల తర్వాత బలవంతంగా జీవితం చాలిస్తున్న పురుషుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. వీరంతా క్షణికావేశంతో ప్రాణాలు వదిలి కుటుంబ సభ్యులను తీరని శోకంలోకి నెడుతున్నారు. మరి కొందరు మాత్రం తెలిసీ, తెలియని వయసులో ప్రేమ మాయలో పడి ప్రాణాలు వదులుకుంటున్న ఘటనలు ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయి.

జిల్లా వ్యాప్తంగా 2023లో ఆత్మహత్యల సంఖ్య ఇలా..

తొలి మూడు నెలల్లో	జూన్ 30వ తేదీ వరకు	జూలై 1 నుంచి 30 వరకు
63	76	33

ఏడు నెలల్లో ఆత్మహత్య చేసుకున్న వారు	ఆత్మహత్యకు యత్నించి బతికినవారు
172	206

ఏడు నెలల్లో మొత్తం ఆత్మహత్యాయత్నాలు	378

చావు పరిష్కారం కాదు



ఏ సమస్యకైనా సరే చావు పరిష్కారం కాదు. సహనంతో ఉంటే వందేళ్లు జీవించవచ్చు. అర్ధాంతరంగా తనువు చాలించడం పిరికి వాళ్ల పని. యువత ప్రేమ విఫలమైందని ప్రాణాలు తీసుకోకూడదు. పెళ్లి విషయంలో సొంత నిర్ణయాలు మంచిది కాదు. ఉద్యోగం, ఆర్థిక సమస్యలు, అనారోగ్యం తదితర సమస్యలతో ఒత్తిడికి లోను కారాదు. కాస్త స్థిమితంగా ఆలోచిస్తే తప్పక పరిష్కారం దొరుకుతుంది.

– ఎస్వీ మాధవ్‌రెడ్డి, ఎస్పీ

కణేకల్లు చెరువుకు తుంగభద్ర జలాలు



ఆంధ్రా సరిహద్దు హెచ్చెల్సీలో ప్రవహిస్తున్న నీరు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి విడుదలైన జలాలు సోమవారం ఆంధ్రా సరిహద్దులో (105వ కిలోమీటర్ వద్ద) 989 క్యూసెక్కుల మేర వస్తున్నట్లు డీఈఈ మద్దిలేటి తెలిపారు. కణేకల్లు చిక్కణ్ణేశ్వర చెరువుకు జలాలు చేరాయి. ఇక్కడి నుంచి పీఏబీఆర్‌కు నీరు వదులుతామన్నారు. రెండు రోజుల తర్వాత సరిహద్దులో నీటి విడుదల పరిమాణాన్ని పెంచుతామని పేర్కొన్నారు. ప్రమాదకరంగా ఉన్న కాలువ గట్ల వద్ద గస్తీ ముమ్మరం చేసినట్లు చెప్పారు.

టీబీ డ్యాంలో 76 టీఎంసీలు

ఎగువన కురుస్తున్న వర్షాలతో టీబీ డ్యాంకు భారీగా వరద నీరు చేరుతోంది. సోమవారం ఉదయానికి జలాశయంలో 76.191 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 46,669 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 2,099 క్యూసెక్కులుగా నమోదైంది.

గెస్ట్ టీచర్లకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయుల (తాత్కాలిక) పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల జిల్లా కన్వీనర్ మురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. పీజీ, బీఈడీ, టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు ఆగస్టు మూడో తేదీన కురుగుంట గురుకుల కళాశాలలో నిర్వహించే డెమోకు హాజరు కావాలన్నారు. డెమోలో ఎంపికైన అభ్యర్థులను రోస్టర్ ప్రకారం గురుకుల పాఠశాలల్లో ఏడాది పాటు బోధించడానికి నియమిస్తామని తెలిపారు.

ఊరూరా ఇంకుడు గుంతలు

- భూగర్భజలమట్టం పెంపొందించేందుకు చర్యలు
- మండల స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి కృషి
- అధికారులతో కలెక్టర్ అరుణ్‌బాబు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: భూగర్భజల మట్టం పెంచేందుకు ఊరూరా గుంతలు తవ్వేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఇందుకు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలో 7 వేల ఇంకుడు తవ్వనుండగా, తొలివిడతలో 14 మండలాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఇందుకోసం మంగళవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలకు మండల స్థాయిలో నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలన్నారు. జగనన్న సురక్ష ద్వారా వచ్చిన అర్జీలకు టోకెన్స్ రైజ్ చేసి సేవా సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. జగనన్న సురక్ష అమలులో జిల్లా రాష్ట్రంలోనే 3వ స్థానం దక్కించుకోవడం విశేషమన్నారు. 30 రోజుల్లో 5 లక్షలకుపైగా కుటుంబాలను సర్వే చేసి 4.88 లక్షల మందికి సేవా సర్టిఫికెట్లు అందజేశామన్నారు.

నిర్మాణాల పురోగతికి శ్రద్ధ చూపాలి

ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాల పురోగతిపై పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీర్లు, హౌసింగ్ నిర్మాణాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వలంటీర్ల హౌస్ హోల్డ్ సర్వే ఇప్పటికీ 80 శాతం మాత్రమే పూర్తయిందని, 100 శాతం పూర్తయ్యేలా ఎంపీడీఓలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకుముందు ఆయన జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తదితరులతో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 197 అర్జీలు అందగా, వాటి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎంటీ నాయక్, పట్టుపరిశ్రమ శాఖ జేడీ పద్మమ్మ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డ్వామా పీడీ రామాంజనేయులు, సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగ ప్రసాద్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ పాల్గొన్నారు.

స్పందనలో వచ్చిన అర్జీల్లో కొన్ని

- తనకు గ్రామంలోని సర్వే నంబర్ 768–2ఏ, 772–2, 783–1 లో 4.44 ఎకరాల భూమి ఉందని ఓడీసీ మండలం సున్నంపల్లికి చెందిన మరళీమోహన్ కలెక్టర్‌కు తెలిపారు. దాన్ని కొంతమంది ఆక్రమించుకోగా, కోర్టు ద్వారా హక్కులు సాధించుకున్నానని... అయితే సదరు భూమిని రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో రెడ్‌మార్క్‌లో పెట్టారని ఫిర్యాదు చేశారు. దీనిపై పలుమార్లు అధికారులకు తెలిపినా ఫలితం లేకుండా పోయిందన్నారు. మీరే న్యాయం చేయాలని బాధితుడు కోరారు.
- లేపాక్షి మండలం పులమతి గ్రామం సర్వే నంబర్ 44–3లో తనకున్న 4.80 ఎకరాల భూమిని కొందరు ఆక్రమించుకున్నారని బాలాజీ అనే వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పిత్రార్జితమైన తన ఆస్తికి హద్దులు చూపించి న్యాయం చేయాలని కోరారు.
- రైతులకు వెంటనే ప్రత్యామ్నాయ విత్తనాలు అందజేయాలని రైతు సంఘం నాయకులు రమణ, వేమనారాయణ, వెంకటనారాయణ కలెక్టర్‌కు విన్నవించారు. ఉలవ, పెసర, అలసంద, జొన్న విత్తనాలను అందజేయాలన్నారు.

మాతాశిశు మరణాలను నియంత్రించాలి

- జాయింట్ కలెక్టర్ చేతన్



మాతా శిశు మరణాలపై సమీక్షిస్తున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో మాతా శిశు మరణాలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో చిలమత్తూరు, బత్తలపల్లి, సోమందేపల్లి, రామగిరి, గాండ్లపెంట, నల్లచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 14 శిశు మరణాలు సంభవించినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. అలాగే రామగిరి, దర్శనమల, ధర్మవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 3 మాతృ మరణాలు సంభవించడం తనను కలచి వేసిందన్నారు. హైరిస్క్ కేసులను ముందస్తుగా గుర్తించడంలో నిర్లక్ష్యం వల్లే ఈ ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ఇక నుంచి క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, మెడికల్ అధికారులు సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తదుపరి జరిగే సమావేశాలకు ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్లు, ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు హాజరయ్యేలా చూడాలన్నారు. ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలోని ఎల్‌సీకే పురం ఆరోగ్య కేంద్రం ఆరోగ్య కార్యకర్తకు షోకాజ్ నోటీసు జారీ చేయాలన్నారు. బత్తలపల్లి పీహెచ్‌సీలో రికార్డులు సరిగా లేవని డాక్టర్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సెల్విసాల్మన్, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, డీఐఓ డాక్టర్ కృష్ణయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి, పీడియాట్రిస్ట్ వెంకటేశ్వర్లు, గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మలత, డీపీఎంఓ కుల్లాయప్పనాయక్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

పట్టు 'ధర'హాసం



మార్కెట్‌లో పట్టుగూళ్ల విక్రయాలు

హిందూపురం అర్బన్: మల్బరీ రైతులకు మంచి రోజులొచ్చాయి. పట్టుగూళ్లకు మార్కెట్‌లో మంచి ధరలు పలుకుతుండటంతో రైతు ఇంట ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్నాళ్లు రూ.400 లోపే పలికిన కిలో బైవోల్టిన్ పట్టుగూళ్లు సోమవారం ఏకంగా రూ.495 మేర పలికాయి. హిందూపురం పట్టు గూళ్ల మార్కెటకు సోమవారం 5,208 కిలోల పట్టుగూళ్లు రాగా, కిలో గరిష్టంగా రూ.495, కనిష్టంగా రూ.230, సగటున రూ. 382 ప్రకారం పలికినట్లు మార్కెట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మిరెడ్డి తెలిపారు. హిందూపురం మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తుండటంతో రోజురోజూ సరుకు భారీగా వచ్చిచేరుతోందని, మంచి ధరలు కూడా లభిస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటా సంక్షేమ కాంతులు

- ముగిసిన 'జగనన్న సురక్ష'
- 5 లక్షల ఇళ్ల సర్వే పూర్తి చేసిన వలంటీర్లు, అధికారులు
- 4.80 లక్షల మందికి సేవా సర్టిఫికెట్లు అందజేత
- జిల్లాకు రాష్ట్రంలో మూడో స్థానం

పుట్టపర్తి అర్బన్: ఇంటింటా సంక్షేమ కాంతులు వెల్లివిరిశాయి. రూపాయి ఖర్చు లేకుండా సేవా సర్టిఫికెట్లు అందాయి. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, మండల కమిటీలు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషితో జిల్లాలో నెలరోజులుగా సాగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

11 రకాల సర్టిఫికెట్లు

'జగనన్న సురక్ష'లో కుల, ఆదాయ, జనన, మరణ, మ్యూటేషన్స్, వివాహ, ఫ్యామిలీ మెంబర్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కు మొబైల్ లింక్, కౌలు రైతులకు సీసీఆర్‌సీ సర్టిఫికెట్, కొత్త బియ్యం కార్డు, హౌస్ హోల్డ్ విభజన వంటి 11 రకాల సేవా సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశారు.

రాష్ట్రంలో మూడోస్థానం

జిల్లాలో 32 మండలాలు, 6 మున్సిపాలిటీలు ఉండగా 'జగనన్న సురక్ష'లో 38 కమిటీలు పని చేశాయి. జూన్ 24వ తేదీన ప్రారంభమైన సురక్ష కార్యక్రమం జూలై 31న పూర్తయింది. అధికారులు, వలంటీర్లు 5 లక్షల ఇళ్లను సర్వే చేశారు. ఇందులో 4.88 లక్షల మందికి సేవా సర్టిఫికెట్లు అందజేశారు. దీంతో శ్రీసత్యసాయి జిల్లా 98.19 శాతంతో రాష్ట్రంలోనే 3వ స్థానాన్ని దక్కించుకుంది.

జిల్లాలో ఆరు లక్షల కుటుంబాలు

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 4.7 లక్షల కుటుంబాలు ఉండగా, జగనన్న సురక్ష సర్వేతో ప్రస్తుతం 6,12,051 కుటుంబాలు ఉన్నట్లు తేలింది. వలంటీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు జిల్లాలో 4,97,179 కుటుంబాలను సందర్శించి 4,88,171 టోకెన్లు రైజ్ చేశారు. గడువు లోపు 4,79,244 సర్టిఫికెట్లు, గడువు తర్వాత 1,195 సర్టిఫికెట్లు కలిపి మొత్తంగా 4,80,439 సేవా సర్టిఫికెట్లు అందజేశారు. మరో 1,576 టోకెన్లను రిజెక్ట్ చేశారు. కలెక్టర్ అరుణ్‌బాబు ఎప్పటికప్పుడు మండలస్థాయి ప్రత్యేకాధి కారులు, ఎంపీడీఓ, తహసీల్దార్లకు సూచనలు, సలహాలిస్తూ మండల కమిటీలు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో కార్యక్రమాన్ని పక్కాగా కొనసాగించారు. ఒకవైపు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటా సర్వే కొనసాగించగా.. మరోవైపు రోజూ ఓ సచివాలయం పరిధిలో సురక్ష క్యాంపులు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.



గోరంట్ల మండలం మందలపల్లిలో సేవా సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

అన్నీ ఉచితంగానే..



రూపాయి ఖర్చు లేకుండానే నా కుటుంబానికి 12 సేవా సర్టిఫికెట్లు అందాయి. చాలా సంతోషంగా ఉంది. గతంలో ఒక సర్టిఫికెట్ కావాలంటే మీ–సేవలో దరఖాస్తు చేసి మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఒక్కో సర్టిఫికెట్‌కు కనీసంగా రూ.200 ఖర్చు చేయాల్సి వచ్చేది. 'జగనన్న సురక్ష'తో సేవా సర్టిఫికెట్లన్నీ ఉచితంగా ఇచ్చారు.


– అశ్వని, వెంకటగారిపల్లి

సమష్టి కృషితో విజయవంతం

అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే జిల్లాలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం విజయవంతమైంది. 4,80,439 సేవా సర్టిఫికెట్లు ప్రజలకు అందజేయడంతో జిల్లాకు రాష్ట్రంలోనే మూడో స్థానం దక్కింది. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు. జగనన్న సురక్ష ఉద్యోగులు, ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. పేదల జీవితంలో మరచి పోలేని గొప్ప కార్యక్రమంగా నిలుస్తుంది.

– అరుణ్‌బాబు, కలెక్టర్

ప్రాంతీయ సమన్వయకర్తగా మంత్రి పెద్దిరెడ్డి



అనంతపురం క్రైం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్తగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

క్లుప్తంగా

దివ్యాంగుల పునరావాస కేంద్రం ఏర్పాటుకు చర్యలు


మాట్లాడుతున్న డీఆర్‌ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా పునరావాస కేంద్రాన్ని పుట్టపర్తిలో ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య తెలిపారు. పునరావాస కేంద్రం ఏర్పాటు అంశానికి సంబంధించి జిల్లా స్థాయి అధికారులతో సోమవారం తన చాంబర్‌లో ఆయన సమీక్షించారు. పునరావాస కేంద్రం ఏర్పాటైతే శస్త్ర చికిత్సలు చేయడం, వినికిడి పరికరాల అమర్చడం, వివిధ ఆస్పత్రులకు సిఫారసు చేయడం, వివిధ ఉపకరణాలు అందజేయడం వంటివి చేపట్టాల్సి ఉంటుందన్నారు. డీఆర్‌డీఏ ద్వారా పింఛన్లు, బిడ్డ జన్మించిన తక్కువ వ్యవధిలోనే వైకల్యం ఉంటే గుర్తించడానికి ఐసీడీఎస్ ద్వారా చర్యలు తీసుకోవాలని సూచించారు. సదరం సర్టిఫికెట్లను డీఎంహెచ్‌ఓ ద్వారా అందజేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ అబ్దుల్ రసూల్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియాసాల్మన్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, ఉపాధి కల్పనా అధికారి కల్యాణి పాల్గొన్నారు.

ఐటీ శాఖకే కన్నం

- నకిలీ డాక్యుమెంట్లతో క్లెయిమ్‌లు
- ఐటీ రిటర్న్స్ కోసం తప్పుడు దారి
- అధికారుల పరిశీలనలో బట్టబయలు
- ఉమ్మడి జిల్లాలో 2వేల మందికి నోటీసుల జారీ
- మరో వెయ్యి మందికి కూడా నోటీసులు ఇచ్చే అవకాశం

సాక్షి ప్రతినిధి అనంతపురం: కొందరు ఉద్యోగులు ఆదాయపు పన్ను (ఐటీ) శాఖకు కన్నం వేశారు. నకిలీ డాక్యుమెంట్లు పెట్టి తమకు రావాల్సిన సొమ్ము కంటే ఎక్కువ డబ్బును క్లెయిమ్ చేసుకున్నారు. ఉదాహరణకు వార్షిక ఆదాయం రూ.10 లక్షలుంటే ఆదాయపన్ను 15 శాతం కట్టాల్సి ఉంటుంది. కోత పడిన రూ.1.50లక్షల్లోంచి హెల్త్ ఇన్సూరెన్స్, ఎల్‌ఐసీలు, ట్యూషన్ ఫీజులు, హౌసింగ్ లోన్లు ఇలా రకరకాల సేవింగ్‌లు ఉన్నట్టు చూపించి రూ.1.20 లక్షలు క్లెయిముల ద్వారా వెనక్కు వచ్చేలా చేసుకున్నారు. ఐటీ శాఖ అధికారులకు అనుమానం వచ్చి క్లెయిములు పరిశీలిస్తే చాలా వరకు నకిలీవని తేలింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో దాదాపు 2వేల మందికి నోటీసులు జారీచేశారు. ఇందులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువగా ఉన్నట్టు ఆదాయ పన్ను శాఖ వివరాల్లో వెల్లడైంది.



హైదరాబాద్ ట్యాక్స్ కన్సల్టెంట్ల ప్రమేయం

కరోనా అనంతరం చాలామంది బహుళజాతి కంపెనీల ఉద్యోగులు వర్క్ ఫ్రం హోం (ఇంటి నుంచే పని) చేస్తున్నారు. ఐటీ శాఖకు కట్టాల్సిన దాన్ని తగ్గించుకోవాలన్న తాపత్రయంతో చాలామంది హైదరాబాద్‌లో ట్యాక్స్ కన్సల్టెంట్లను సంప్రదించినట్టు తెలిసింది. వారి ద్వారా రకరకాల డాక్యుమెంట్లు పెట్టి ఐటీ శాఖకు పంపించారు. ఇందులో ప్రధానంగా వార్షికాదాయం రూ.10 లక్షలకు మించి ఉన్న వారు ఇష్టారాజ్యంగా ట్యాక్స్‌కు సంబంధించిన నకిలీ ధ్రువపత్రాలు ఇచ్చారు. కొంతమంది ట్రస్టులకు విరాళాలు ఇచ్చినట్టు సృష్టించి ఐటీ రిటర్న్స్ వచ్చేలా చేసినట్టు తేలింది. దీంతో అలాంటి వాళ్లందరికీ ఐటీ శాఖ నోటీసులు జారీచేసింది.

ఆరో తేదీ వరకు గడువు

తమకు రావాల్సిన దానికంటే పెద్దమొత్తంలో రిటర్న్స్ తెచ్చుకుని నోటీసులు అందుకున్న వారు ఆగస్టు ఆరో తేదీలోగా ఒరిజినల్ డాక్యుమెంట్లు సమర్పించాలని ఐటీ శాఖ పేర్కొంది. ఆ తేదీలోగా ధ్రువపత్రాలు ఇవ్వకపోతే భారీగా జరిమానా విధిస్తారు. అంతకూ చెల్లించకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి వెనుకాడరు. దీంతో ఆయా వేతనదారులు గగ్గోలు పెడుతున్నారు. మరో వెయ్యి మందికి పైగా నోటీసులు వచ్చే అవకాశం ఉన్నట్టు ఐటీ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఆదాయపు పన్ను శాఖ నిబంధనల ప్రకారం శ్లాబు రేట్లు ఇలా

ఆదాయం కేటగిరీ	ఐటీకి చెల్లించాల్సిన సొమ్ము(శాతంలో)
రూ.5లక్షలు - రూ.7.50లక్షలు	10
రూ.7.50లక్షలు -రూ.10లక్షలు	15
రూ.10లక్షలు -రూ.12.50లక్షలు	20
రూ.12.50లక్షలు -రూ.15లక్షలు	25
రూ.15 లక్షలు -ఆ పైన	30

200 శాతం జరిమానా



ట్యాక్స్ రిటర్న్స్ కోసం తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇస్తే 200 శాతం మేర జరిమానా వేస్తారు. అంటే మనకు లక్ష రూపాయలు రిటర్న్ వస్తే ఆ రూ.లక్షను బ్లాక్ చేసి మరో రూ.2 లక్షలు ఫైన్ వేస్తారు. ఇది ఐటీ శాఖ రూల్స్. అందుకే ట్యాక్స్ కన్సల్టెంట్‌లకు అర్హత ఉండాలి. నిపుణులతో చేయించుకుంటేనే ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

–రాజేష్ గౌడ్, చార్టెర్డ్ అకౌంటెంట్

సీఎం జగన్‌తో ఎంపీ మాధవ్ దంపతుల భేటీ


సీఎం జగన్‌ను వివాహానికి ఆహ్వానిస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్ దంపతులు

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ దంపతులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆగస్టు 21న కర్నూలులో జరగనున్న తన సోదరుడి కుమార్తె వివాహానికి రావాలని ఆహ్వానించారు.

గంజాయి వార్తలు అవాస్తవం


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత

కదిరి టౌన్: గంజాయి మత్తులో ఇద్దరు యువకులు దాడులు చేశారంటూ టీవీ చానళ్లలో ప్రసారమవుతున్న కథనాలు అవాస్తమని కదిరి డీఎస్పీ శ్రీలత అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆదివారం కర్ణాటకలోని బాగేపల్లికి చెందిన వారు ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చారన్నారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమై వెళుతున్న వారి కారును ద్విచక్ర వాహనంపై వస్తున్న కదిరికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఢీకొన్నారన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపామన్నారు. ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని, ఎవరూ ఎలాంటి మత్తు పదార్థాలు తీసుకోలేదన్నారు. తాను కదిరి డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించి మూడు నెలలు కావస్తోందని, 90 శాతానికి పైగా మాదకద్రవ్యాలను నియంత్రించినట్లు పేర్కొన్నారు. వార్తలు ప్రచురణ, ప్రసారం సమయంలో సంబంధిత అధికారి వివరణ జోడిస్తే ఎలాంటి వివాదాలకు తావుండదన్నారు.

వ్యక్తి అరెస్ట్

స్థానిక నిజాంవలి కాలనీలోని అల్మైర్ మసీదు వద్ద నివాసముంటున్న చింతపండు వ్యాపారి కోలార్ షబ్బీర్ ఇంట్లో గత నెల 17న చోటు చేసుకున్న చోరీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. చోరీకి పాల్పడిన కదిరి నివాసి షేక్ ఇర్ఫాన్‌ను అరెస్ట్ చేసి, 6 తులాల బంగారు నగలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ మధు తెలిపారు.

‘పోలీసు స్పందన’కు 60 వినతులు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయం వేదికగా సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వివిధ సమస్యలపై 60 మంది బాధితులు నేరుగా ఎస్పీ మాధవరెడ్డిని కలసి తమ గోడు వెల్లబోసుకున్నారు. సమస్య తీవ్రతను బాధితుల నుంచి తెలుసుకున్న ఎస్పీ... నేరుగా సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో ఫోన్‌లో మాట్లాడి, చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, దిశ డీఎస్పీ వరప్రసాద్, లీగల్ అడ్వైజర్ సాయినాథ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఈమె పేరు మహసీనా. కదిరి పట్టణ నివాసి. మూడేళ్ల క్రితం నల్లమాడకు చెందిన నాసిర్‌తో వివాహమైంది. ఓ బాబు ఉన్నాడు. కొంత కాలంగా మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ అదనపు కట్నం, బంగారం కోసం ఆమెను భర్త వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని తన అత్త, మామ దృష్టికి తీసుకెళితే వారు కూడా భర్త నాసిర్‌కే వత్తాసు పలికారు. వీరికి ఆడపడచు తోడు కావడంతో ఆమెపై వేధింపులు తారాస్థాయికి చేరుకున్నాయి. చివరకు తనను హత్య చేయడానికి కూడా వారు వెనుకాడడం లేదని, తనకు న్యాయం చేయాలంటూ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి ఎదుట మొరపెట్టుకుంది. స్పందించిన ఎస్పీ వెంటనే కదిరి డీఎస్పీకి ఫోన్ చేసి న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.



ఇతని పేరు రాఘవేంద్ర. పుట్టపర్తి మండలం పెడపల్లిలో ఆర్‌ఎంపీగా జీవనం సాగిస్తున్నాడు. గోరంట్లలో నిర్వహిస్తున్న శ్రీవారి చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ.5 లక్షల చీటీలు రెండు వేశాడు. నెలకు రూ.10 వేలు చొప్పున చెల్లించాడు. ఈ ఏడాది మొత్తం రూ.10 లక్షలు చేతికి అందాల్సి ఉండగా నిర్వాహకులు చేతులెత్తేశారు. కార్యాలయాన్ని సైతం తెరవడం లేదు. ఫోన్ చేస్తే వాయిదాలు చెబుతున్నారు. ఇలా తనలా చాలా మంది మోసపోయి చీటి నిర్వాహకుల చుట్టూ తిరుగుతున్నట్లు సోమవారం జిల్లా పోలీసులు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి ఎదుట వాపోయాడు. సమస్య తీవ్రత తెలుసుకున్న ఎస్పీ వెంటనే గోరంట్ల పోలీసులతో ఫోన్‌లో మాట్లాడి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

.... ఇలా సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఎందరో ఎస్పీని నేరుగా కలసి తమ గోడు వెల్లబోసుకున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

బావిలో పడి వ్యక్తి మృతి


మృతుడు నరసప్ప

గుడిబండ: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం ఫళారం గ్రామానికి చెందిన నరసప్ప (49) సోమవారం ఉదయం 9 గంటలకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి వ్యవసాయ బావిలో పడ్డాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లి పరిశీలించారు. బావి వద్ద చెప్పులు గమనించి లోపలకు చూడడంతో నీటిలో తేలుతున్న మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని వెలికి తీశారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, మృతుడికి భార్య, లక్ష్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నాయకత్వం పటిష్టంగా ఉండాలి

- మూడో విడత హెచ్‌ఎంల శిక్షణ కార్యక్రమంలో డీఈఓ సాయిరామ్


మాట్లాడుతున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడు రూరల్: పాఠశాల విద్య బలోపేతం కావాలంటే క్షేత్రస్థాయి అమలులో ప్రధాన భూమిక పోషించే ‘స్కూల్ హెడ్స్’ నాయకత్వం పటిష్టంగా ఉండాలని డీఈఓ ఎం.సాయిరామ్ అన్నారు. ‘పాఠశాల లీడర్ షిప్’ అంశంపై అనంతపురం శివారులోని టీటీడీసీలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మూడో విడత శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ జరుగుతుంది. శిక్షణ ప్రారంభించిన డీఈఓ మాట్లాడుతూ... విధినిర్వహణలో ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఈ శిక్షణ పరిష్కార మార్గాలు చూపుతుందన్నారు. పాఠశాల అభివృద్ధిలో హెచ్‌ఎంలే కీలకం అన్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలన్నారు. వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం, నాయకత్వ సామర్థ్యాల పెంపు, అభ్యసన, సంసిద్ధత తదితర అంశాలపై రిసోర్స్‌పర్సన్లు శిక్షణ ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సమావేశంలో పరిశీలకులు నాగమ్మ, ఏఎంఓ విభాగం ప్రసాద్, రఫీ, చంద్రమోహన్‌రెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ సాధించే వరకూ పోరాడదాం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

పుట్టపర్తి టౌన్: కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కేంద్రంలోని బీజేపీ సర్కార్ మోసం చేసిందంటూ సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ విమర్శించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలంటూ సోమవారం పుట్టపర్తిలోని గణేష్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విభజన చట్టంలోని హామీలను నెరవేర్చకుండా 2014 నుంచి ఇప్పటి వరకూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాయలసీమకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసేంత వరకూ పోరుబాట సాగిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రవీణ్, జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతమి, నాయకులు నాగార్జున, బాబావలి, బ్యాళ్ల అంజి, శ్రీనివాసులు, పైపల్లి గంగాద్రి పాల్గొన్నారు.

3న పెనుకొండకు చంద్రబాబు రాక

పెనుకొండ రూరల్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 3న గొల్లపల్లి రిజర్వాయర్, కియా పరిశ్రమను సందర్శించనున్నారు. ఈ మేరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వైభవంగా కుళ్లాయిస్వామి చివరి దర్శనం


కుళ్లాయిస్వామి పీరును చూపుతున్న దృశ్యం

నార్పల: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గూగూడు కుళ్లాయి స్వామి పీరు చివరి దర్శనం సోమవారం కనుల పండుగగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు హుస్సేనప్ప ప్రత్యేక పూజలు చేశారు. తిరుమల కొండన్న వంశస్తులు స్వామి వారి ప్రతిమను పట్టు వస్త్రాల మధ్య భక్తులకు చూపించారు. అనంతరం పట్టు వస్త్రాల మధ్య ఉంచి పెట్టెలో భద్రపరిచారు. స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

విగ్రహం, గద, నాగ పడగ లభ్యం


బావిలో దొరికిన గద, నాగ పడగ


ఆంజనేయ స్వామి విగ్రహం

తనకల్లు: మండలంలోని ఈతోడులో ఆంజనేయ స్వామి విగ్రహం, గద, నాగ పడగ లభ్యమయ్యాయి. గ్రామస్తులు తెలిపిన మేరకు.. మొహర్రం ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం ఓ యువకుడు పెద్దబావిలో నాలుగు, ఐదు అడుగుల తవ్వి పంచలోహాలతో చేసిన గద, నాగ పడగను వెలికి తీశాడు. అనంతరం ఆదివారం అర్ధరాత్రి అదే యువకుడు బావిలోకి వెళ్లి ఆరు అడుగుల మేర తవ్వి ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహం వెలికి తీశాడు. ఆంజనేయస్వామి విగ్రహం దాదాపు 20 కిలోల బరువుంటుందని స్థానికులు తెలిపారు. వీటిని పీర్ల చావిడి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ విషయమై తహసీల్దార్ శోభాసువర్ణమ్మను వివరణ కోరగా విగ్రహం, గద, నాగ పడగ దొరికినట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై విచారణ చేయిస్తామన్నారు.

బ్లెకింగ్ వర్సిటీలో అడ్మిషన్లు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ), బీటీహెచ్ బ్లెకింగ్ యూనివర్సిటీ (స్వీడన్) సంయుక్తంగా ప్రవేశపెట్టిన డ్యూయల్ డిగ్రీ కోర్సుకు 12 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. వివరాలను జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన సోమవారం వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో భాగంగా బీటెక్ కోర్సు మూడేళ్లు జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాలలో, ఒక సంవత్సరం విద్యను స్వీడన్‌లోని బీటీహెచ్‌లో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. బీటెక్ డిగ్రీని జేఎన్‌టీయూ, బీఎస్ పట్టాను బ్లెకింగ్ వర్సిటి (స్వీడన్) ప్రదానం చేస్తుందన్నారు. తర్వాత ఎంఎస్ (మాస్టర్స్) ప్రోగ్రాంను బీటీహెచ్‌లోనే చేయవచ్చునన్నారు. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ కంప్యూటర్ సైన్స్‌లో 10 మంది విద్యార్థులు, ఇంటి గ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్‌లో ఇద్దరు విద్యార్థులు అడ్మిషన్ పొందారన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులను వర్సిటీ రిజిస్ట్రార్ సి.శశిధర్, డైరెక్టర్లు పి.సుజాత, ఆర్.కిరణ్మయి, వేల్పుల గురుదత్, జి. ఫణిశేఖర్ (బీటీహెచ్ వర్సిటీ) అభినందించారు.

బాలుడి మృతిపై విచారణ


విచారణ చేస్తున్న వైద్యాధికారి వెంకటరమణ

తనకల్లు: కొక్కంటిక్రాస్‌లో ఆర్‌ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్ వికటించి పవన్ కళ్యాణ్ (8) మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ సోమవారం విచారణ చేపట్టారు. ఆర్‌ఎంపీ కుళ్లాయప్ప నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని పరిశీలించారు. జ్వరం రావడంతో నాయనమ్మ యల్లమ్మ ఆ బాలుడిని తన వద్దకు తీసుకువచ్చారని, పరీక్షించిన అనంతరం అవిల్, డేకాడ్రాన్ ఇంజక్షన్లను కండరాలకు ఇచ్చినట్లు ఆర్‌ఎంపీ వివరించారు. నిబంధనల మేరకు కేవలం ప్రథమ చికిత్స నిర్వహించకుండా ఇంజక్షన్లు, ఫ్లూయిడ్స్ ఎక్కించడం తదితరాలు నిర్వహిస్తున్నట్లుగా విచారణలో నిర్ధారణ కావడంతో నివేదికను సిద్ధం చేసి, జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు డాక్టర్ వెంకటరమణ తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య

పావగడ: మొబైల్ చార్జర్ ఇప్పించలేదన్న కోపంతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పావగడ తాలూకా వైఎస్ హోసకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగిరెడ్డి పల్లికి చెందిన ఆశ కార్యకర్త వరలక్ష్మమ్మ కుమారుడు నిఖిల్‌గౌడ (18) పీయూసీ చదువుతున్నాడు. ఈ క్రమంలో తనకు మొబైల్ చార్జర్ ఇప్పించాలని తల్లిని సోమవారం ఉదయం కోరాడు. ఆమె పొరుగింటికి వెళ్లి చార్జర్ తీసుకువచ్చి ఇవ్వడంతో జాప్యం చోటు చేసుకుంది. దీంతో క్షణికావేశానికి లోనైన నిఖిల్‌గౌడ ఇంటి తలుపులు వేసుకున్నాడు. కాసేపటి తర్వాత ఇంటికి చేరుకున్న తల్లి ఎంత సేపు పిలిచినా తలుపులు తీయకపోవడంతో ఇరుగు పొరుగు వారి సాయం తీసుకుని తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమారుడు కనిపించాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మాళప్ప అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశాడు.